క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మార్కొండపాడు పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చాగల్లు: కురుస్తున్న వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.బుజ్జి అన్నారు. మంగళవారం మండలంలోని మార్కొండపాడు, దారవరం, బ్రాహ్మణగూడెం పంచాయతీలలో నీటిమునిగిన పంట పొలాలు, పంట బోదులు, రహదారులను ఆయన పరిశీలించారు. ఆయన తోపాటు అగ్రికల్చర్ అధికారి ఎం.వేణుగోపాల్, ఏంజీఎన్ఆర్ జీఎస్ ఏపీఓ పి.అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

సురక్షిత ప్రాంతాలకు పశువులు



ఖండవల్లిలో రైతులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ

పెరవలి: గోదావరికి వరద ఉధృతంగా ప్రవహించడంతో లంకల్లోని పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాధాకృష్ణ ఆదేశించారు. ఖండవల్లి గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న రైతులకు అవగాహన కల్పించారు. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తిందని దీని వలన పశువులకు సురక్షితమైన తాగునీరు, పశు గ్రాసం సమృద్ధిగా అందించటంతోపాటు పశువులను లంకల నుంచి సురక్షితమైన ఏటిగట్టుపై ఉంచాలన్నారు. ఈ వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బువాపు వ్యాధుల సోకుతుందని ముందస్తుగా వాక్సిన్ వేయించాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. జబ్బు చేస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యం అందిచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ సల్మా, చరణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

కొవ్వూరు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యాం రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పేద,బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు గానీ, కార్మికులకు ఏమాత్రం లాభం లేదన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం నష్టాల్లో ఉన్న విశాఖ స్టీలు ప్లాంటుకి కనీసం నిధులు విడల్చకపోవడం బాధకరం అన్నారు. 25 రకాల ఖనిజ ఉత్పత్తులపై సుంకాన్ని తగ్గించడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు, మహిళలకు కేటాయింపులు కంటితుడుపుగానే ఉన్నాయన్నారు. ఇది కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేకూర్చే బడ్జెట్ అని పేర్కొన్నారు.
కేంద్ర బడ్జెట్‌లో అసంఘటిత, కార్మిక,భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీ సంక్షేమ బోర్డుకి ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం బాధకరమని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ఆరోపించారు.

మోదీ సర్కారు నిబద్ధతకు బడ్జెట్ నిదర్శనం

నల్లజర్ల: భారత్ వ్యవస్థాపకశక్తి, వ్యాపారాన్ని సులభతరం చేసి దేశాన్ని ఆర్థికాభివృద్ధిలో నడిపించే మోదీ సర్కారు నిబద్ధతను బడ్జెట్ తెలియజేస్తోందని బీజేపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి శివనాగరాజు అన్నారు. తొమ్మిది ప్రాధాన్యతా అంశాల ఆధారంగా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు నిధులు, పోలవరం ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేయడానికి సాయంతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షించ దగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిచ్చే విధంగా నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడం ఆనందదాయకమన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నిడదవోలు: మండలంలోని సింగవరం, రావిమెట్ల గ్రామాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ శాఖ ఆధ్వర్యంలో రొటెరియన్ ఇంజే శేఖర్ ఆర్థిక సాయంతో ఎర్ర కాలువ వరద బాధితులు 60 కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబు సాయంతో వారందరికీ మధ్యాహ్నం భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆకుల రాజీవ్, ఉపాధ్యక్షుడు గుబ్బల సత్య ప్రసాద్, కోశాధికారి కొయ్యే కృష్ణంరాజు, పెచ్చెట్టి, ఫణిసింహ, ఇంజే ఝాన్సీ రాణి, ఆనందం మురళీకృష్ణ, రాపాక వెంకట్రావు, చంపాటి శ్రీనివాస్ రాజు, ఆరుగొల్లు వెంకటేశ్వరావు, కొయి నాగులు పాల్గొన్నారు.



ముక్కామలలో నీట మునిగిన పామాయిల్ తోట



నిడదవోలు మండలం రావిమెట్ల వద్ద ఎర్రకాలువ వరద



వేగేశ్వరపురం లంక భూముల్లో ముంపు బారిన పడిన బెండ తోట



ఖండవల్లి లంకలో మోటార్‌ను ఆటోలో ఎక్కిస్తున్న రైతులు

ఉప్పొంగిన గోదావరి

- రాత్రికి రాత్రే పెరిగిన వరద
- మునిగిన లంక పంటలు
- ముంపుబారిన 1800 ఎకరాలు
- గగ్గోలు పెడుతున్న లంక రైతులు

పెరవలి: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. లంక పంటలు నీటమునిగాయి. పెట్టుబడి, శ్రమ నీటిపాలయ్యాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత మూడు రోజులుగా నిలకడగా ఉన్న గోదావరి రాత్రికి రాత్రే లంకలను ముంచెత్తడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఊహించని విధంగా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వ్యవసాయ ఉత్పత్తులు ఒబ్బిడి చేసుకునే పరిస్థితి కూడా లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం దిగువ లంకలను మునిగి ఉండగా మంగళవారం ఉదయం ఎగువ లంకలను ముంచెత్తడంతో పంటలు కళ్లెదుటే నీట మునగడంతో పెట్టుకుంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో నోటికి దక్కకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలంలో కానూరు, కానూరుఅగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల వద్ద 3 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో 1800 ఎకరాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కోకో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు తోటలతోపాటు జామ, బొప్పాయి, కొబ్బరి, తమలపాకు తోటలు, కూరగాయలు, పూలు, మొక్కజొన్న తోటలు నిలువునా మునిగిపోయాయి. వాణిజ్య పంటలైన కంద, పసుపు, చెరకు, అరటి పంటలకు ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టిన పంటలు పోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజు రోజుకీ గోదావరి పెరుగుతుందే తప్ప తగ్గే పరిస్థితి లేకపోవడంతో పంటలపై పూర్తిగా ఆశలు వదులుకున్నామని చెబుతున్నారు.

లంక భూముల్లోకి వరదనీరు

తాళ్లపూడి: గోదావరి ఉధృతి పెరుగుతోంది. వరద పెరగడంతో మంగళవారం లంక భూముల్లోకి నీరు చేరుతోంది. తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద, ప్రక్కిలంక ర్యాంపు వద్ద నది ప్రవాహం ఉధృతంగా మారింది. గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భూముల్లోని పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వేగేశ్వరపురం మేరీమాత ఆలయం మెట్ల వద్దకు వరదనీరు చేరింది. తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురంలోని గోదావరి లంకల్లో సాగవుతునర్న బెండ, దొండపాదులు, వంగ, అరటి, కంద, ఆకుకూరలు నీటిబారిన పడ్డాయి. వరద పెరిగితే పంటలకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. చేపల వేట నదిలోకి ఎవరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.



కానూరు అగ్రహారంలో నీట మునిగిన లంక పంటలు

వీడని ఎర్రకాలువ వరద

నిడదవోలు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎర్రకాలువ వరద ముంపు మంగళవారం కొనసాగుతోంది. కంసాలిపాలెం, సింగవరం, రావిమెట్ల, తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం, శంకరాపురం గ్రామాల్లోని వరి చేలు ముంపులోనే ఉన్నాయి. కంసాలిపాలెం-రావిమెట్ల వెళ్లే ప్రధాన రహదారిపై వరదనీరు తగ్గడంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ముంపు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ నాగభూషణం పరిశీలించారు. రావిమెట్ల సొసైటీ వద్ద పాడిరైతులకు పశువుల దాణాను ఉచితంగా అందజేశారు. గోదావరి ఉధృతి పెరగడంతో పెండ్యాల, పందలపర్రు, జీడిగుంట, పురుషోత్తపల్లి గ్రామాల్లోని లంక పొలాలు నీటమునిగాయి. పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది వరదనీరు తగ్గిన ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడంతో పాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు.

ముంపులోనే పంట పొలాలు

- గోష్పాద క్షేత్రాన్ని ముంచెత్తిన గోదావరి వరద
- మద్దూరులంకలో పర్యటించిన జాయింట్ కలెక్టర్
- డివిజన్‌లో 7,110 ఎకరాలు ముంపు

కొవ్వూరు: భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీటిమునిగాయి. డివిజన్‌లో 7,110 ఎకరాల్లో వ్యవసాయ పంటలు నీటిలో నానుతున్నాయి. గోదావరి నదిలో వరద ఉధృతి పెరగడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని ముంచెత్తింది. సుమారు రెండు అడుగుల మేరకు వరద నీరు క్షేత్రంలో ప్రవహిస్తోంది. దీంతో అధికారులు క్షేత్రంలోకి భక్తులకు వెళ్లకుండా భారీ కెట్లు ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యూ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు. మరో వైపు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద వరద ఉధృతి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుండడంతో మండలం మద్దూరులంక గ్రామానికి వరద ముంపు పొంచి ఉంది. గ్రామాన్ని తాకుతూ వరద ప్రవహిస్తుండడంతో నీరు గ్రామంలోకి ప్రవేశించకుండా ఇసుక బస్తాలను పటిష్టం చేశారు. ఇప్పటికే ఆరు రోజుల నుంచి ముంపులోనే ఉండడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఉంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కొవ్వూరు, ఆరికిరేవుల, నందమూరు, పశివేడల, కుమారదేవం, చిడిపి తదితర గ్రామాల్లో పంటలు ముంపుబారిన పడ్డాయి. డివిజన్‌లో వరికి రైతులకు అత్యధిక నష్టం వాటి ల్లింది. 7,029 ఎకరాలు ముంపులో ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 80 ఎకరాల్లో చెరుకు పంట నీట మునిగింది. అత్యధికంగా నిడదవోలు మండలంలో 3,392 ఎకరాలు, ఉండ్రాజవరంలో 2 వేల ఎకరాల్లోను, గోపాలపురంలో 881, దేవరపల్లిలో 931 ఎరకరాలు, తాళ్లపూడిలో 689.5, కొవ్వూరులో 560, పెరవలిలో 412, నల్లజర్లలో 478, చాగల్లులో 687 ఎకరాల్లోను వరి పంటను వరదనీరు ముంచెత్తింది.



మద్దూరులంకలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

మద్దూరులంకలో జేసీ పర్యటన

గోదావరి ఉధృతి పెరిగిన నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మంగళవారం సాయంత్రం మద్దూరులంక గ్రామంలో పర్యటించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితుల తలెత్తిన ఎదుర్కోనేందుకు అధికార యంత్రాంగం సిద్ధం ఉండాలని ఆదేశం చారు. ఎగువ ప్రాంతం భద్రచలంలో వరద ఉధృతి నిలకడగా ఉండడంతో కాస్తా ఊరట కలగవచ్చని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, వరద కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలంతా కాచి చల్లర్చిన నీటినే తాగాలని ఆయన చెబుతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మందులు అన్నీ అందుబాటులో ఉన్నామన్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, టూరిజం అధికారి స్వామి నాయుడు, తహసీల్దార్ కె.మస్తాన్, అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పెరవలి: మురుగునీరు పారుదలకు అడ్డంకిగా ఉన్న డ్రైన్లలో పూడికను తొలగించే పనులకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కానూరులో ముంపుగురైన ప్రాంతాలను మంగళవారం పరిశీలించి అనంతరం నీరు వెళ్లే మురుగు డ్రైన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు డ్రైన్ పూర్తిగా పూడుకుపోయిందని ఇలా అయితే నీరు ఎలా వెళుతుందని, ఇంత వరకు పూడుక తొలగించలేదని అధికారులపై ఆగ్రహించారు. రెండు గంటల్లో ఈ పూడికను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్నేళ్లగా వర్షాకాలంలో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, అందుకు డ్రైన్ల పూడుకుపోవడమే కారణమని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డ్రైన్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా తూరలు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. దీనితో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పూడికలు తీత పనులు వెంటనే చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అఘతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ డి.సుధ, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, సర్పంచ్ భావన మధు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కానూరులో ప్రజలు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ముంపు ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి

ఉండ్రాజవరం: ముంపులో ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని కాల్దారీ, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాలల్లో ఎర్రకాలువ (యనమదుర్రు డ్రైన్) ఉధృతికి ముంపునకు గురైన ప్రాంతాల్లో మంగళవారం ఆమె పరిశీలించారు. ముంపునకు గురైన పంట పొలాల్లో నీటి నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిషత్తులో ముంపు నివారణ చర్యల కోసం దీర్ఘకాలిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలంలో మూడు గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల పంట ముంపునకు గురైనట్టు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, ఎంపీడీవో నరేంద్రరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ముంపు నుంచి తేరుకుంటున్న పంటలు

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ ఉధృతి తగ్గుముఖం పట్టింది. పంటపొలాలు ముంపు నుంచి తేరుకుంటున్నాయి. వర్షాలకు మండలంలో సుమారు 1696 ఎకరాలలో వరి, చెరకు, ఇతర కూరగాయల పంటలు ముంపు బారినపడ్డాయి. రాగోలపల్లి నుంచి తాడిపూడి వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు కల్వర్టుపై నుంచి, అన్నదేవరపేట నుంచి వేగేశ్వరపురం వైపునకు వెళ్లే కల్వర్టు, తిరుగుడుమెట్ట, వెంకటాయపాలెం వైపు వెళ్లే మరో కల్వర్టులపై నుంచి వరద నీరు ఇంకా ప్రవహిస్తోంది. రాగోలపల్లి, తుపాకుల గూడెం, బయ్యారం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో వరి చేలు ముంపు నుంచి బయటపడుతున్నాయి. వరిపై బురద మట్టి చేరడంతో కుళ్లిపోతున్నాయని, నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు.



అన్నదేవరపేట వద్ద తేరుకుంటున్న వరి చేలు

శరవేగంగా అన్న క్యాంటీన్ మరమ్మతులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

నిడదవోలు: పట్టణంలోని పాటిమీద సెంటర్ పంగిడి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రత్యేక నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు కలిపి మొత్తం రూ.11లక్షలతో ఈ పనులను చేపడుతున్నారు. భవనం ఎలివేషన్, టైల్స్, పెయింటింగ్, ఫర్నిచర్, విద్యుత్, మంచినీటి సదుపాయాల వంటి పనులు చేస్తున్నారు. గతంలో ఈ భవనంలో వార్డు సచివాలయం నిర్వహించారు. సచివాలయాన్ని ప్రైవేట్ అద్దె భవనంలోకి మార్చు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చే నెల 15న అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి మంగళవారం అన్న క్యాంటీన్ మరమ్మతుల పనులను పరిశీలించారు. నెల ఐదో తేదీకి పనులు పూర్తి చేయాలని, చుట్టపక్కల పరిశుభ్రం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ టి.సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఏఈ డి.గోపాల్‌నాయుడు, మున్సిపల్ ఏఈ హేమంత్, గంగుల గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలుగా మార్పునకు కృషి

పెరవలి: జిల్లాలో శాఖా గ్రంథాలయాలను సాంకేతింగా అభివృద్ధి చేయటమే కాకుండా పాఠకులకు అనుగుణంగా పుస్తకాలు సరఫరా చేస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాయాల అధికారి ఎం.శేఖర్‌బాబు తెలిపారు. పెరవలి మండలంలో మంగళవారం ఆయన ముక్కామల శాఖా గ్రంథాలయల రికార్డులను పరిశీలించి అనంతరం పుస్తక నిక్షిప్త కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన గనులని వీటిని సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలో గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చుటానికి చర్యలు చేపట్టామని ఇప్పటికే పట్టణాల్లో ఉన్నవాటిని పూర్తి చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేపట్టామన్నారు. పుస్తకాలు, కంప్యూటర్లు, భవనాల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పెరవలి మండలంలో శాఖా గ్రంథాలయాలు, పుస్తక నిక్షిప్త కేంద్రాలు నిర్వహణ చాలా బాగుందని, రికార్డుల పరిశీలిస్తే తెలుస్తున్నాయని వివరిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకు ఎం.వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, బీడీసీలు పాల్గొన్నారు.



ముక్కామల శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

నల్లజర్ల: కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యావిధానానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నల్లజర్ల నంబరు-1 ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈఓ వై.సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దేశంలో కొత్తగా జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయాలన్న దానిపై డాక్టరు కృష్ణస్వామి కస్తూరి రంగన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఎన్ఈపీ 2020ని ప్రవేశపెట్టారన్నారు. అప్పటి వరకు 10+2+3 విద్యావిధానాన్ని రద్దు చేసి 5+3+3+4 విద్యావిధానాన్ని అమలు చేశారన్నారు. ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఎం.గంగరాజు, ఉపాధ్యాయిని కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లజర్లలో జరిగిన వారోత్సవాలలో పాల్గొన్న ఎంఈఓ సత్యనారాయణ

బాల్య వివాహాల నివారణపై అవగాహన

చాగల్లు: బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణ నివారణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వి.పద్మావతి అన్నారు. చాగల్లులో బేటి బచావో- బేటి పడావో కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలు, అక్రమ రవాణాపై మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటి నివారణకు కృషి చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా అంగన్‌వాడీ పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆడపిల్లల చదువు, సంరక్షణతోపాటు డయల్ 100, వన్ స్టాప్ సెంటర్ల పనితీరుపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది బి.మహాలక్ష్మి, బి.విజయలక్ష్మి, టి.సౌదామణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


శాంతించిన ఎర్ర కాలువ

- తేరుకుంటున్న పంటలు
- 90 శాతం పంటలు వరదపాలు
- కోలుకోలేమంటున్న అన్నదాత
- 15722 ఎకరాల్లో దెబ్బతిన్న వరిచేలు

దేవరపల్లి: భారీ వర్షాలకు ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహించిన కొవ్వాడ, ఎర్ర కాలువలు మంగళవారం శాంతించాయి. రెండు కాలువల్లో నీటి ప్రవాహనం సాధారణంగా ఉండడంతో నీటమునిగిన వరి చేలు అక్కడక్కడ తేరుకొంటున్నాయి. జిల్లాలో అత్యధిక వర్షపాతం మెట్ట ప్రాంతంలోని నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో నమోదైయింది. దాదాపు ఐదు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు మెట్ట ప్రాంతంలోని వేలాది ఎకరాల వరి, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 33 గ్రామాల్లోని 2475 మంది రైతులకు చెందిన 15722 ఎకరాల వరి చేలు నీటమునిగినట్టు వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా నివేదిక తయారు చేశారు. కొవ్వాడ కాలువ ఉధృతికి గోపాలపురం మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం, బీమోలు, చెరుకుమిల్లి గ్రామాలు, దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, కొండగూడెం, చాగల్లు మండలంలో చాగల్లు, నెలటూరు, గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరం, మార్కొంటపాడు, ధారవరం గ్రామాల్లోని పంటలు ముంపుకు గురైనట్టు అధికారులు తెలిపారు. మండలంలో సుమారు 1676 ఎకరాల్లో వరి చేలు ముంపుబారిన పడినట్టు నివేదిక తయారు చేశారు. దేవరపల్లి మండలంలో 570 ఎకరాలు, గోపాలపురం మండలంలో 2500 ఎకరాల్లోను, తాళ్లపూడి మండలంలో రాగాలపల్లి, బయ్యవరం, తిరుగుడుమెట్ట, అన్నదేవరపేట గ్రామాల్లోని 1694 ఎకరాల్లో వరి చేలు దెబ్బతిన్నాయి. నాలుగు మండలాల్లో సుమారు 6430 ఎకరాల్లో వరి చేలు ముంపుబారిన పడినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఎర్రకాలువ ముందపునకు దేవరపల్లి మండలం త్యాజంపూడి, కురుకూరు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలు, నల్లజర్ల మండలంలో చోడవరం, గుండేపల్లి, అనంతపల్లి, గ్రామాల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో వరి చేలు దెబ్బతిన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే చేలల్లోని నీరు తీయకపోవడంతో దాదాపు 10 రోజుల నుంచి వరి చేలు నీటమునిగి ఉండడంతో కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వరినారు లభించదని, ప్రత్యామ్నాయ పంటలు తప్ప వేరే దారిలేదని రైతులు అంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేలు ఎట్టుబడి పెట్టి వరి నాట్లు వేశామని, వర్షాలకు చేలు నీటిపాలయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం రాయితీపై అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గౌరీపట్నం వద్ద ముంపు నుంచి తేరుకుంటున్న వరి చేలు



గౌరీపట్నం వద్ద కొవ్వాడ కాలువ వరద నీటిలో పది రోజులుగా మునిగి ఉన్న వరిచేలు